

# వాళ్ళు

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

ప్రతి వేసంకాలం నేను వారం పది రోజులపాటు ఏదో ఓ ప్రదేశానికి వెళ్తుండడం గత పదేళ్ళుగా అలవాటు. ఉద్యోగం, భార్య, పిల్లలు, ఇంట్లోని సమస్యలు లాంటి వాటికి దూరంగా వెళ్తే మనసు ప్రశాంతంగా వుంటుంది.

ఆ విధంగా ఆగ్రా, బెనారస్, కన్యాకుమారి, కోణార్కలాంటి ఎన్నో ప్రదేశాలు చూశాను. క్రితం సంవత్సరం వేసవికి నేను మధురై వెళ్ళాను. మధుర మీనాక్షిని చూసినట్లూ వుంటుంది, దగ్గరే వున్న రామేశ్వరమూ వెళ్ళచ్చు.

అన్నానగర్‌లోని మధురైలో చిన్న హోటల్‌లో బసచేశాను. ఆ హోటల్ కిటికీలోంచి చూస్తే పక్కనే వున్న చిన్న సందు ఎదురుగా వున్న చిన్న మధ్య తరగతి ఇల్లొకటి కనిపిస్తుంది. టమిళియన్ సంప్రదాయం ప్రకారం కట్టిన ఆ ఇంట్లో ఓ జంట, ఓ ముసలావిడ వుంటున్నారని గమనించాను.

తీరికగా వున్నప్పుడు కుర్చీలో కూర్చుంటే ఎదురుగా ఆ ఇల్లు కనిపించేది. ఆ ఇంటి ఆవరణలో పెరిగిన కొబ్బరిచెట్టు, ఆ చెట్టు మీదకి పాకించిన మనీప్లాంట్, నేలలో పెరగడం వల్ల చేటలకన్నా విశాలంగా పెరిగిన మనీ ప్లాంట్ ఆకులని చూడడం నాకు సరదాగా వుండేది.

క్రమంగా వాటితోపాటు ఆ ఇంట్లోని వాళ్ళని కూడా నాకు తెలీకుండానే గమనించసాగాను. ముసలావిడకి ఆ అమ్మాయి కూతురయి వుండాలి. అతను అల్లుడై వుండాలి. అల్లుడికి కూతురంటే పడదు. అతను మందువాలో మంచం మీద గోడకి ఆనుకొని ఎటో చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూంటే అతని భార్య కాఫీ తెచ్చేది. అతను వద్దంటే బ్రతిమాలేది. ఆ కాఫీ గ్లాసు అందుకుని దూరంగా గిరాటేసేవాడు. ఆ ముసలావిడ తన కూతురు భుజం చుట్టూ చేతిని వేసి లోపలికి తీసుకెళ్ళేది.

ఇలాంటి అనేక సంఘటనలు నా కళ్ళపడ్డాయి. ఆ భార్యాభర్తలిద్దరూ ఎందుకలా వుప్పు నిప్పులా ప్రవర్తిస్తారో నా కర్థం అయేది కాదు. ఆ అమ్మాయి నల్లగా వున్నా మంచి కళగావుండేది. పైగా సౌమ్యురాలులా కనిపించేది.

ఒకసారి అతను తన భార్యని గట్టిగా తిట్టేవాడు. నాకు అరవం రాదు కాబట్టి దాని గురించి అర్థం అయేది కాదు. ఓ రాత్రి గట్టిగా కేకలు వినబడితే మంచం మీద లేచి కూర్చుని కిటికీలోంచి చూశాను. ఆ అమ్మాయిని బయటికి పొమ్మని తోసేస్తున్నాడు భర్త వుద్రేకంగా. అతను తాగి వచ్చాడని గ్రహించాను ఉచ్చారణ, ప్రవర్తన బట్టి. ఇంగ్లీష్‌లో కూడా కొంత మాట్లాడాడు. 'ఇంట్లో వుంటే చంపేస్తాను. ఇక నిన్ను, నీ పాపాన్ని భరించడం నాకు సాధ్యం కాదు' అని అరిచాడు.

ముసలావిడ అడ్డుపడి తన కూతుర్ని లోపలకి తీసుకెళ్ళింది. మర్నాడు వుదయం బ్రేక్‌ఫాస్టు అయాక గది ఖాళీ చేయాలి. మర్నాడు వుదయం కూడా వాళ్ళింట్లోంచి పెద్దపెట్టున అరుపులు వినిపిస్తున్నాయి. నా గదికి రోజులా పొంగల్, రెండిడ్లీ, వడ తెచ్చిన రూంబాయ్ కిటికీలోంచి ఆ ఇంటి వంక తొంగిచూసి ముసిముసిగా నవ్వుకోవడం గమనించి అడిగాను.

"ఎందుకు వాళ్ళలా పోట్లాడు కుంటున్నారు?"

మళ్ళీ అలాగే నవ్వి చెప్పాడు. "వేసక్టమీ చేయించుకున్న ఏ మగాడైనా గర్భవతైన పెళ్ళాంతో ఎందుకు పోట్లాడుతాడు?"

"అంటే?" అడిగాను వులిక్కిపడి.

"అంటే ఆమె అతని రెండో భార్య. మొదటి భార్య, పిల్లలు రైలు ఏక్సిడెంట్‌లో మరణించారు. ఇప్పుడామెకి మూడో నెల. కారణం ఆ అమ్మాయి బావట. అత్తగారు ఆ అమ్మాయి తనింట్లో వుండడానికి వీల్లేదు అని ఆ అమ్మాయి పెద్ద వాళ్ళకి వుత్తరం రాసినా వాళ్ళు పుట్టింటికి తీసుకు వెళ్ళడానికి ఇష్టపడలేదు.'

"అత్తగారా? ఆ అమ్మాయి తల్లి కాదా ఆ ముసలావిడ!?"

"కాదు. బయటకి ఎంతో మంచిగా నటిస్తుంది. కాని ఆవిడకి లోపల మండిపోతోంది కోడలి మీద. చివరికే మవుతుందో చూడాలి."

హోటల్ ఖాళీ చేసి విశాఖపట్నం వెళ్తుంటే నాకు ఆ సంగతి మనసులోంచి పోలేదు. ఏమవుతుంది ఆ అమ్మాయి కథకి ముగింపు? చంపి పారేస్తాడా? ఏలుకుంటాడా? అబార్షన్ చేయిస్తాడా? విడాకులిస్తాడా?

విశాఖపట్నం వెళ్ళాక ఆ విషయం ఆలోచించి ఓ కథ రాశాను. మనుషుల్ని చెడ్డగా చిత్రించక, పరిస్థితుల్ని చెడ్డగా చిత్రించే రచయితగా నాకు మంచి పేరుంది. ఏ పరిస్థితిలో ఆమె గర్భవతయిందో రాసి చివరికి ఆమెకి భర్త విడాకులిస్తే, ఆమె బావ ఆమెని వివాహం చేసుకున్నట్టుగా ముగించాను. నేను క్రయిమ్ కథా రచయిత అయి వుంటే ఆ కథకి ముగింపు ఇంకోలా వుండేది.

నాకు ఆ కథకి అంగీకారం వచ్చినప్పుడు, ప్రచురించినప్పుడు, పారితోషికం చెక్ వచ్చినప్పుడు, ఆ డబ్బు డ్రా చేసినప్పుడు ఆమె కథ ఎలా ముగిసిందో అనిపించసాగింది. ఆ కథ తాలూకు డబ్బుతో కొన్న బూట్లు వేసుకున్నప్పుడల్లా రోజూ మధురైలోని ఆ అభాగ్యురాలే గుర్తుకు రాసాగింది.

ఈసారి వేసవి శెలవలకి కంచి, పక్షితీర్థం, మహాబలిపురం లాంటి వాటికి వెళ్ళి తిరిగివస్తూ ఒక రోజు కోసం మళ్ళీ మధురై వెళ్ళాను. నిజానికి మధురై వెళ్ళడానికి మళ్ళీ తమిళనాడుకి టూర్ పెట్టుకున్నానంటే సబబు.

ఆ హోటల్‌లో దిగి రెండు వందల ఆరో నంబరు గదే కావాలని అడిగాను. అది ఖాళీ లేదు. పక్క గది రెండు వందల ఏడులో దిగాను. మూసి వున్న కిటికీ తలుపులు తెరచి ఎదురుగా చూశాను.

ఆ ఇల్లు, కొబ్బరిచెట్టు, మనీ ప్లాంట్ ఆకులు, మందువా కనబడ్డాయి. నేను ఆశ్చర్యపడేలా అయిదు నెలల పసికందుని అతను ఎత్తుకుని తిప్పుతున్నాడు ఏడుస్తుంటే. నాకెంతో ఆశ్చర్యం వేసింది. కొద్ది క్షణాల్లో అతని తల్లి పాల బాటిల్‌తో వచ్చింది. ఆవిడ కింద కూర్చుని పసిపిల్లవాణ్ణి ఒళ్ళోవేసుకుని పాలు పట్టసాగింది.

ఆమెనే కాదు! ఆమె బిడ్డని కూడా ఎలా అంగీకరించాడు!!

కాఫీతో నా గదిలోకి వచ్చిన బాయ్ నన్ను గుర్తు పట్టి పలకరింపుగా నవ్వాడు. కిటికీ తలుపులోంచి బయటి ఇంటి వంక చూశాడు.

"అతను భార్యని పంపించేశాడా?" అడిగాను ఆసక్తిగా.

"వాళ్ళు పంపలేదు సార్. పురిట్లో ఆ దేముడే తీసుకెళ్ళి పోయాడు. ఇప్పుడా పిల్లాడు ఆ తల్లీకొడుకులకి నెత్తి మీది దేవత. ఆమె బ్రతికే వుంటే ఈ పిల్లాణ్ణి రాచి రంపాన పెట్టి వుండేవారు. కాని ఇలా ప్రేమగా చూసుకుని వుండే వారు కాదు" చెప్పాడు రూమ్‌బాయ్.

నేను తల తిప్పి మళ్ళీ ఆ ఇంటి వంక చూడసాగాను.